
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు

ఆదివారం 31 ఆగస్టు 2025





రాగి పిండిలో పురుగులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టరేట్ ఆవరణలోని ఇందిరా మహిళా శక్తి చిరుధాన్యాల దుకాణంలో కొనుగోలు చేసిన రాగి పిండిలో పురుగులు రావడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. పట్టణానికి చెందిన పవన్ రెండు రోజుల క్రితం దుకాణంలో రాగిపిండిని కొనుగోలు చేశారు. ప్యాకెట్ తెరువగా పురుగులు చేరి బూజు పట్టి కనిపించింది. దీంతో ఆయన ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్ తనిఖీలు చేశారు. రాగిపిండి ప్యాకెట్లకు మ్యానిఫ్యాక్చరింగ్ లేబుల్స్, ఎక్స్‌పైరీ డేట్ లేకపోవడం, ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్‌కు కనీసం దరఖాస్తు చేసుకోకపోవడంతో కేసు నమోదు చేశారు.

గణపతి పూజల్లో జయాగుణచైతన్య రెడ్డి

ప్రసాద వితరణ చేసిన స్టేట్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జయాగుణచైతన్య రెడ్డి



రామ్‌మందిరం వద్ద గణేష్ మండపంలో ప్రసాదాలను పంపిణీ చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రామ్‌మందిరం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జయాగుణచైతన్య రెడ్డి, అల్లుడు గుణచైతన్యరెడ్డి, కుమారుడు భరత్‌సాయి రెడ్డి పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్మలా జగ్గారెడ్డి, జయారెడ్డి భక్తులకు లడ్డూ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి కుటుంబ సభ్యులను పూజారి శాలువాలతో సత్కరించారు.



సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రామ్‌మందిరం వద్ద ఏర్పాటు చేసిన గణపతి వద్ద జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు

డెంగ్యూతో బాలుడు మృతి

బిల్లు చెల్లించే వరకు మృతదేహాన్ని ఇవ్వని ఆస్పత్రి



సుశాంత్‌చారి (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూతో చికిత్స పొందుతున్న బాలుడు మృతిచెందగా.. బిల్లు చెల్లించే వరకు మృతదేహాన్ని ఇవ్వడానికి ఆస్పత్రి నిర్వాహకులు నిరాకరించారు. దీంతో, కొడుకును పోగొట్టుకుని పుట్టెడు దుఖంలో ఉన్న తల్లిదండ్రులు అప్పు చేసి బిల్లు కట్టి మృతదేహాన్ని తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తునికి గ్రామానికి చెందిన కమ్మరి జ్యోతి, రవిచారి దంపతులకు ఇద్దరు పిల్లలు. కొడుకు సుశాంత్‌చారి(10) ఐదో తరగతి, కూతురు సౌజన్య(7) రెండో తరగతి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఈ నెల 14న వెల్దుర్తి మండలంలోని నాయినిజలాల్‌పూర్‌లో అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. 20వ తేదీన సౌజన్యకు జ్వరం రావడంతో వెల్దుర్తిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా డెంగ్యూ అని గుర్తించారు. దీంతో, సంగారెడ్డిలోని గాయత్రి ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 23న ఇంటి వద్ద ఉన్న సుశాంత్‌చారికి కూడా జ్వరం వచ్చింది. దీంతో, బాలుడిని కూడా సంగారెడ్డిలోని గాయత్రి ఆస్పత్రిలోనే చేర్పించారు. ఇద్దరికీ డెంగ్యూ నిర్ధారణ కావడంతో చికిత్స చేయించారు. సౌజన్య కోలుకోవడంతో 27 డిశ్చార్జి చేశారు. సుశాంత్ పరిస్థితి విషమించడంతో 28న కూకట్‌పల్లి అంకుర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. ఆస్పత్రి బిల్లు చెల్లించే వరకు మృతదేహాన్ని ఇవ్వలేదని తల్లి జ్యోతి కన్నీరుమున్నీరయ్యారు. తమవంటి పరిస్థితి ఎవరికీ రావొద్దని ఆమె రోదించారు.

అయ్యో.. యూరియా

ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీగా తగ్గిన కోటా

- అధికారుల కాళ్లు పట్టుకుంటున్న రైతులు
- ఆగస్టు నెలలో 10 వేల టన్నులు కోత
- సెప్టెంబరు కోటా సైతం ప్రశ్నార్థకమే
- 20 జిల్లాల్లో దాదాపు పూర్తయిన పంపిణీ
- మెతుకుసీమకే అత్యధికంగా రావాల్సి ఉండగా.. ఎక్కువగానే బ్యాలెన్స్
- తాజా వర్షాలతో అత్యవసరం

'బాంచెన్ సార్.. నీ కాల్మొక్తా ఒక్క బస్తా యూరియా ఇయ్యండి' అంటూ రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజా వర్షాలకు పొలం పనుల్లో నిమగ్నమవ్వాల్సిన రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కి కనిపిస్తున్నారు. యూరియా బస్తాల కోసం బారులు తీరుతున్నారు. బస్తా చేతికి రాక నిరాశతో తిరిగివెళ్తున్నారు. వానలోనూ పడరాని పాట్లు పడుతున్నారు. మెతుకుసీమ నలుమూలలా గతంలో ఎన్నడూ లేనివిధంగా యూరియా కష్టాలు చుట్టుముట్టాయి. ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీగా కోటా తగ్గించడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది.



మెదక్ జిల్లా రామయంపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఆగస్టు నెలలో యూరియా వివరాలు (టన్నుల్లో)

జిల్లా	అవసరం	వచ్చింది	రావాల్సింది
సిద్దిపేట	11,750	5,345	6,405
సంగారెడ్డి	6,616	4,675	1,541
మెదక్	6,600	4,100	2,500
మొత్తం	24,966	14.120	10,466


సంగారెడ్డి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాకు ఆగస్టులో దాదాపు 25 వేల టన్నుల యూరియా అవసరం. కానీ 15వేల టన్నులు మాత్రమే వచ్చింది. మిగతా 10 వేల టన్నులు కోత పెట్టారు. ఈ కోటా కూడా దిగుమతి అయితే యూరియా కష్టాలు ఉండేవి కాదు. ఇంత భారీ స్థాయిలో కోటా తగ్గించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సీజన్‌లో మెదక్ జిల్లాకు 29వేల టన్నులకు 13,839 టన్నులు, సంగారెడ్డి జిల్లాకు 35వేల టన్నులకు 14,731 టన్నులు, సిద్దిపేట జిల్లాలో 40వేల టన్నులకు 22,503 టన్నులు సరఫరా చేశారు. రావాల్సిన కోటాలో ఇంచుమించు సగమే కేటాయించడంతోనే ఇబ్బందులు వచ్చాయి. రాష్ట్రం మొత్తంగా చూస్తే ఉమ్మడి మెదక్ జిల్లాకే అత్యధికంగా యూరియా కోటా రావాల్సి

మిగతా 7లో

అటవీభూమి
ఆక్రమణకు యత్నం
నాలుగు వాహనాలు స్వాధీనం
7




సింగూరుకు భారీ వరద..
పొంచిఉన్న ముప్పు
ప్రాజెక్టు దిగువ ప్రాంతాలు అప్రమత్తం
7



167 ఎ.సి.-పి.ఎస్.-వరుస సంఖ్య : 36 - 87 - 165
వయస్సు :66 లింగము :F
ఇ.నెం. :1-33/1
ఎపిక్ నెం. UVT1757533
170 ఎ.సి.-పి.ఎస్.-వరుస సంఖ్య : 36 - 87 - 168
తండ్రి పేరు :గోపాల్
వయస్సు :25 లింగము :M
ఇ.నెం. :1-33/1
ఎపిక్ నెం. UVT1756881
173 ఎ.సి.-పి.ఎస్.-వరుస సంఖ్య : 36 - 87 - 171
తండ్రి పేరు :లక్ష్మయ్య

ఝరాసంగం మండలం బోజ్యానాయక్ పంచాయతీలో నాలుగేళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితాలో వచ్చాయి. మృతిచెందిన తొమ్మిది మంది పేర్లు జాబితాలో ఉన్నట్లుగా గ్రామస్తులు తెలిపారు. బీఎల్‌వోకు చెప్పినా పట్టించుకోలేదని అంటున్నారు. ఇక ఈదులపల్లికి చెందిన యువకుడి ఫోటో, వివరాలు ఏడాకులపల్లి జాబితాలో కనిపించాయి.




264 ఎ.సి.-పి.ఎస్.-వరుస సంఖ్య : 37 - 32 - 243
ఓటరు పేరు :చాకలి బిచ్చమ్మ
భర్త పేరు :చాకలి అడివయ్య
వయస్సు :56 లింగము :F
ఇ.నెం. :1-54
ఎపిక్ నెం. XSQ2067296
265 ఎ.సి.-పి.ఎస్.-వరుస సంఖ్య : 37 - 32 - 244
ఓటరు పేరు :చాకలి బిచ్చమ్మ
భర్త పేరు :చాకలి అడివయ్య
వయస్సు :56 లింగము :F
ఇ.నెం. :1-54
ఎపిక్ నెం. XSQ2478477

వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్‌కు చెందిన చాకలి బిచ్చమ్మ, పందుల నర్సింహులు, మంగలి భానుశ్రీ, ఉప్పరి లక్ష్మీనారాయణల మృతిచెందినప్పటికీ వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించలేదు. చనిపోయిన బిచ్చమ్మ పేరు రెండుసార్లు ఉండడం గమనార్హం. గద్దె నందిని, పందుల మహేశ్‌ల పేర్లూ జాబితాలో రెండుసార్లు నమోదయ్యాయి.

ఇదేం జాబితా..!


తప్పులతడకగా కొత్త ఓటరు లిస్ట్

కౌడిపల్లి మండలం బూరుగడ్డకు చెందిన గంగయ్య పేరు సదాశివపల్లి జాబితాలో వచ్చింది. సదాశివపల్లికి చెందిన కొండి మొగులమ్మ భర్త శివయ్య ఫొటో తప్పుగా పడింది. వేరే గ్రామానికి చెందిన వ్యక్తి ఫొటో నమోదు చేశారు. ఇంటి పేర్లు, ఓటర్ల పేర్లు తప్పుగా ముద్రించారు. చనిపోయినవారికీ చోటు దక్కింది.



3412 ఎ.సి.-పి.ఎస్.-వరుస సంఖ్య : 36 - 194 - 82
ఓటరు పేరు :జీఈఈటీహెచ్ఏ ఎస్
భర్త పేరు :ఏజేఏవై కేయూఎంఏఆర్
వయస్సు :34 లింగము :F
ఇంటి నెంబర్. :8-10
ఎపిక్ UVT1771484

- చనిపోయినవారి పేర్లను తొలగించని వైనం
- ఊరు దాటిన భార్యాభర్తల ఓట్లు
- ఒకే జాబితాలో రెండేసి సార్లు ఫొటోలు, వివరాలు
- పెళ్లయి వెళ్లిపోయిన వారికీ చోటు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



గ్రామ పంచాయతీ: ఏడాకులపల్లి

ఝరాసంగం మండలం ఏడాకులపల్లిలో ఈదులపల్లి యువకుడి ఫొటో, వివరాలు

'అందోల్ మండలం నేరేడిగుంటకు చెందిన పత్తి వీరేశం ఓటరు జాబితా చూసి నివ్వెరబోయాడు. తన ఫోటో మాత్రమే ఉంది. పేరు లేదు. దీంతో ఎంపీడీవో వద్దకు వెళ్లి వినతిపత్రం ఇచ్చారు. ఇలాగైతే తనను ఓటు హక్కు వినియోగించకుండా చేస్తారని, వెంటనే తప్పులు సరిదిద్దకుంటే ఉన్నతాధికారుల వద్దకు వెళ్తానని అన్నాడు.'

సంగారెడ్డి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించిన కొత్త ఓటరు జాబితాలను చూసి స్థానికంగా ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ జాబితాల ప్రకారమే వచ్చే ఎన్నికలను నిర్వహిస్తున్న నేపథ్యంలో నివ్వెరబోతున్నారు. జాబితాలో కనిపించిన తప్పులు అధికారులు, సిబ్బంది లోపాలను ఎత్తిచూపుతున్నాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో

మిగతా 8లో

సమయపాలన పాటించరా?

- ఉద్యోగులపై కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆగ్రహం
- మెదక్ కలెక్టరేట్‌లోని పలు విభాగాల తనిఖీ
- అనుమతి లేకుండా సెలవు తీసుకున్న అధికారులపై చర్యలకు ఆదేశం



ట్రెజరీ విభాగంలో హాజరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ కలెక్టరేట్‌లోని పలు కార్యాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఉదయం 11.30 అవుతున్నా సిబ్బంది విధులకు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ కార్యాలయ అధికారి సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మెమో జారీ చేయాలని డీఆర్‌వో భుజంగరావును ఆదేశించారు. ఖజానా శాఖ కార్యాలయంలో హాజరు పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులకు మెమోలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యాలయాలకు చేరుకుని క్రమశిక్షణగా విధులు నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతో బాధ్యతారాహిత్యం తగదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీఆర్వో భుజంగరావు, ఏవో యూనస్ ఉన్నారు.





దూప్‌సింగ్ తండాలో విద్యుత్ లైన్, రహదారికి మరమ్మతులు చేస్తున్న ఆయా శాఖల సిబ్బంది



రామాయంపేట-సిద్దిపేట హైవేకు మరమ్మతులు



నిజాంపేట మండలం నస్కల్‌లో కొట్టుకుపోయిన వంతెన

వరద తగ్గింది.. కన్నీరు మిగిలింది

- సాధారణ స్థితికి చేరుకుంటున్న వరద ప్రభావిత ప్రాంతాలు
- తేరుకుంటున్న రామాయంపేట, దూప్‌సింగ్ తండా
- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- రహదారుల మరమ్మతులు షురూ
- జలదిగ్బంధంలోనే ఏడుపాయల ఆలయం

మెదక్/రామాయంపేట/హవేళిఘణపూర్/పాపన్నపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా అతలాకుతలమైన మెదక్ జిల్లా ఇప్పుడు నెమ్మదిగా సాధారణ స్థితికి చేరుకుంటోంది. రామాయంపేట, దూప్‌సింగ్ తండా, పాపన్నపేట వంటి ప్రాంతాలు వరదల బీభత్సం నుంచి తేరుకుంటున్నాయి. ఇళ్లు, పంటలు, రహదారులకు భారీ నష్టం వాటిల్లినప్పటికీ, పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వరద ప్రభావంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. హవేళీఘణపూర్ మండలం కాప్రాయిపల్లి, రాజ్‌పేట తండా, దూప్‌సింగ్ తండాల్లో మట్టిరోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అనువుగా మార్చుతున్నారు. నార్సింగి-కొడపాక, ధర్మాసాగర్-మంగల్‌పర్తి, ఎల్కుగొండ క్రాస్‌రోడ్-ఉట్లూర్, మెదక్-బొడ్మట్‌పల్లి, నార్సింగి-పెద్దశంకరంపేట, పిల్లికొటాల్-చండీ రోడ్‌ల మరమ్మతులకు రూ. 6.84కోట్లు అవసరమని రోడ్లు భవనాలశాఖ అంచనాలు రూపొందించింది. మెదక్-బోధన్ రహదారి, రామాయంపేట-నస్కల్ మార్గంలో రాకపోకలు ప్రారంభం కాలేదు.

కోలుకుంటున్న రామాయంపేట

ప్రకృతి ఉగ్రరూపానికి కకావికలమైన రామాయంపేట ఇప్పుడు కోలుకుంటోంది. 72 గంటలుగా స్తంభించిన జనజీవనం శనివారం నుంచి సాధారణ స్థితికి చేరుకుంటోంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వ్యాపార సంస్థలు తిరిగి తెరుచుకున్నాయి. మున్సిపాలిటీలోని అక్కల బస్తీ, బీసీకాలనీ, రెడ్డి కాలనీ, ఓంసాయి కాలనీ వాసులు భయాందోళనల నుంచి బయటపడుతున్నారు. ఇళ్లల్లోకి నడుములోతు నీళ్లు రావడంతో రాత్రంతా నరకం అనుభవించిన అక్కల బస్తీవాసులు కుదుటపడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండటానికి పలుచోట్ల నాలాలు శుభ్రం చేస్తున్నారు. వరదల తాకిడికి మండలంలో రూ.15 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. 1,670 ఎకరాల్లో వివిధ పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ సర్వేలో తేలింది. 18 నివాస గృహాలు, పలు కోళ్లఫారాలు కూలిపోయాయి. దెబ్బతిన్న పాత హైవేను పునరుద్ధరిస్తున్నారు. మట్టి రోడ్లు కొట్టుకుపోయిన కాలనీల్లో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్ ప్రయాణికులు లేక బోసిపోయింది. పలుచోట్ల రైలు పట్టాలు దెబ్బతినడంతో చాలా రైళ్లను రద్దు చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్-నిజామాబాద్ రైళ్లు నడుస్తున్నాయి. కాచిగూడ-మెదక్ రైలును నాలుగు రోజులుగా రద్దు చేశారు.

దూప్‌సింగ్ తండాలో కష్టాలు..

హవేళిఘణపూర్ మండలంలోని దూప్‌సింగ్ తండాలో ఎన్నడూ చూడని వరద బీభత్సం చోటు చేసుకుంది. తండా మొత్తం వరద నీటిలో

మిగతా 8లో

గణనాథ నీ లడ్డూ గోవిందా!

కుకునూరుపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దొంగలు బంగారం, డబ్బుల వంటి విలువైన వస్తువులను దొంగిలిస్తారు. కానీ ఇందుకు భిన్నంగా కుకునూరుపల్లిలోని ఒక వినాయకుడి లడ్డూను దొంగలించిన విచిత్ర ఘటన చోటు చేసుకుంది. లక్కుడారం గ్రామానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం చేతిలో ఉన్న లడ్డూను అదే గ్రామానికి చెందిన వినయ్, మధు అనే ఇద్దరు యువకులు రాత్రి చోరీ చేసి సగం తినేశారు. మరో మండపం వద్ద లడ్డూను దొంగిలించడానికి ప్రయత్నించగా నిర్వాహకులు వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఇద్దరు యువకులను ఎంఆర్ఓ ముందు బైండోవర్ చేసి, హెచ్చరించి వదిలిపెట్టారు. వినాయకుడి లడ్డూని చోరీ చేయడం ఏంటని గ్రామస్థులు నవ్వుకుంటున్నారు.

పోలీస్ శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో కీలకం

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పెరేడ్


పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో వీక్లీ పెరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ చాలా కీలకమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నాడు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు సిబ్బందికి వీక్లీ పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు శారీరకంగా, మానసికంగా ఫిట్నెస్‌తో ఉన్నప్పుడే ఎలాంటి పరిస్థితులలోనైనా విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలమని అన్నారు. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. యోగా వంటివి సాధన చేయాలని సూచించారు. భారీ వర్షాల దృష్ట్యా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి పరిస్థితులలోనైనా స్పందించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. రానున్న వినాయక నిమజ్జనం, ఈద్ మిలాడ్ ఉన్ నబీ పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా తగిన బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, డానియల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పరశురాములు (48)

బెజ్జంకి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బెజ్జంకి మండలం ముత్తన్నపేటలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ముత్తన్నపేటకు చెందిన బొర్ర పరశురాములు(48) అనే వ్యక్తి ఈ నెల 20న ఇంట్లో నుంచి కిరాణ సరుకుల కోసం బెజ్జంకికి ద్విచక్ర వాహనం పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా బెజ్జంకిలో పంది అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. దీనితో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నిరసన

పరశురాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్వేరోస్ నెట్ వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు పరశురాములు బెజ్జంకి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెజ్జంకిలో రోడ్ల పై పందులు స్వైర్య విహారం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పందుల కారణంగా ఓ వ్యక్తి ప్రాణం కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ. కోటి పరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం, ఆయన పిల్లలకు చదువుకు ఆయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని వారు డిమాండ్ చేశారు.

కుంటలో పడి వ్యక్తి..


సాయిబాబు (ఫైల్)

చేర్యాల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన సాయిబాబు (30) మృతదేహం అదే గ్రామశివారులోని కుంటలో అనుమానాస్పదస్థితిలో లభ్యమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈమేరకు స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయిబాబు శుక్రవారం సాయంత్రం గ్రామశివారులోని తమస్వంత వ్యవసాయబావి వద్ద పనులు చేస్తుండగా, అతడి తండ్రి అస్వస్థతకు గురైనట్లు బంధువులు ఫోన్ చేయడంతో ఇంటికి బయలుదేరాడు. కానీ రాత్రివరకు సాయిబాబు ఇంటికి తిరిగిరాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకసాగారు. గ్రామశివారులోని వాగు ప్రవహిస్తుండటంతో పరిసరాలలో గాలించినా ఆచూకీ కానరాలేదు. శనివారం ఉదయం గ్రామశివారులోని కుంటకట్ట ఆవరణలో చెప్పులు తేలియాడటాన్ని గమనించడంతో అనుమానం తలెత్తాయి. దీంతో కుటుంబసభ్యులు విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో రెస్క్యూటీంను రప్పించారు. స్థానిక యువకులతో పాటు రెస్క్యూటీం కుంటలో గాలించడంతో మృతదేహం లభ్యమైంది. విషయం తెలిసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహ వెలికితీతను పర్యవేక్షించారు. ప్రభుత్వం తరుపున సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని మృతుడి కుటుంబానికి హామీ ఇచ్చారు. కాగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి పోస్టుమార్టం నిర్వహింపచేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా, గ్రామశివారులోని కుంటకట్ట సమీపంలో కోతుల గుంపు తరచూ సంచరిస్తూ దారినపోయే వారిమీదికి దూసుకువస్తుంటాయని, ఇదేక్రమంలో కోతులగుంపును చూసి భయాందోళనకు గురైన సాయిబాబు కుంటలోపడి ఉంటాడని అభిప్రాయం వ్యక్తం చేశారు.

బహిర్భూమికి వెళ్లిన యువకుడు..


మల్లేశం (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : బహిర్భూమికి వెళ్లిన యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తునికిలో జరిగింది. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాకలి మల్లేశం (28) ఇనెల 28 వ తేదిన రాత్రి బహిర్భూమికి అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మృతుని కుటుంబీకుల తమ బంధువుల వద్ద ఇతర చోట్ల వెతికినప్పటికి ఫలితం లేదు. శనివారం గ్రామ సమీపంలోని చెరువులో శవమై కనిపించాడు. ఇదే విషయం పై మృతుని తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు నమొదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మూర్ఛతో బాలుడు..


సుమన్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి : మూర్ఛతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తునికిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోన్యాల సుమన్ (17) బుధవారం మూర్ఛ రావడంతో వెంటనే నర్సాపూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందతూఊ మృతి చెందాడు.

నర్సింగ్ కాలేజీ విద్యార్థిని షూలో పాము

- సంగారెడ్డిలోని నర్సింగ్ హాస్టల్ వద్ద ఘటన
- భయాందోళనలో ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థినులు


విద్యారిని షూలో పాము

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మహిళా ప్రాంగణంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనం వద్ద ఓ విద్యార్థిని షూలో పాము కనిపించడం కలకలం రేపింది. శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు, విద్యార్థినులు తెలుపగా, శనివారం వెలుగులోకి వచ్చింది. దీంతో నర్సింగ్ విద్యార్థినులు తీవ్ర భయాందోళనలో పడ్డారు. నర్సింగ్ కాలేజీ, హాస్టల్ పక్కనే పెద్ద తోట ఉండడంతో పాము అక్కడి నుంచే వచ్చి ఉండవచ్చనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో. ఎప్పుడు ఏ క్రిమికీటకం ఎక్కడి నుంచి వచ్చి కాటేస్తుందోనన్న భయాందోళన నెలకొన్నదని విద్యార్థినీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నర్సింగ్ కాలేజీ, హాస్టల్ పక్కా భవనాలు త్వరితగతిన పూర్తి చేసి తమను తరలించాలని విద్యార్థినీలు కోరుతున్నారు. కాగా విద్యార్థినీ బూటులో పాము వచ్చిన సంఘటన వాస్తవమేనని, కానీ సిబ్బంది సత్వరం స్పందించి పామును చంపేశారని, ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని సంగారెడ్డిలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుశీల తెలిపారు.

వెరైటీ గణేశా..



రామచంద్రాపురం అశోక్‌నగర్‌లో 40వ ఏట నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వరాహ అవతారంలో వినాయకుడు



సిద్దిపేట పట్టణంలో..



దుబ్బాకలోని కేధారీశ్వరాలయంలో వినాయకుడికి లక్ష గరికపూజ చేస్తున్న మహిళలు



సంగారెడ్డిలోని నేతాజీ నగర్‌లో హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడికి పూజలు

వివిధ రూపాల్లో గణపయ్య

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గణేశ్ నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథులకు భక్తులు పూజలు చేసేందుకు పోటెత్తుతున్నారు. వివిధ రూపాల్లో కొలువుదీరిన గణప య్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కూరగాయలు, గరికతో వినాయకులను అలంకరించి పూజలు చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి)



నారాయణఖేడ్‌లో ప్రతిష్ఠించిన మట్టి గణపతి



మెదక్ : కోలిగడ్డలో ఏర్పాటు చేసిన 23 పీట్ల గణనాథుడు

పొద్దంతా నిరీక్షణ..

● యూరియా కోసం రైతుల అవస్థలు

నర్సాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు నానాటికీ పెరుగుతున్నాయి. శనివారం నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూసి నిరాశతో వెనుదిరిగారు. వచ్చిన ఒకే ఒక్క లారీ యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిజాంపేట : నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షణలో రైతులకు ఒక బస్తా యూరియాను అందజేశారు. ఏవో సోమలింగారెడ్డి, ఎస్సై రాజేష్, వ్యవసాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుమ్మడిదల:(గుమ్మడిదల రైతు సంఘం సొసైటీ వద్ద యూరియా సరఫరా చేస్తున్నారని తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా ఎగబడటంతో గందరగోళం నెలకొంది. పోలీసులు పర్యవేక్షణలో ఆధార్ కార్డు చూపించిన రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేశారు. కొంతమంది రైతులకు యూరియా లభించగా, మరికొందరు నిరాశతో వెనుదిరిగారు.



గుమ్మడిదల లో రైతు సాకార సొసైటీ సంఘంలో యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు



బెజ్జంకిలో యూరియా కోసం క్యూలో నిలబడ్డ రైతులు

వెల్దుర్తి : వెల్దుర్తి సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం వద్దకు 480 బస్తాల యూరియా రావడంతో సుమారు 300 మంది రైతులకు మాత్రమే యూరియా లభించింది. ఏవో ఝాన్సీ మాట్లాడుతూ, 50 మంది రైతుల జిరాక్స్‌లను స్వీకరించామని, వారికి సోమవారం యూరియా అందజేస్తామని తెలిపారు.

కౌడిపల్లి : కౌడిపల్లి రైతు వేదిక వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న రైతులకు పోలీసులు, వ్యవసాయ అధికారుల సమక్షంలో టోకెన్లు పంపిణీ చేశారు.

కొల్చారం : కొల్చారం మండలంలోని రంగంపేటలో యూరియా సరఫరాలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్, ఏవో శ్వేత కుమారి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



వెల్దుర్తి సొసైటి ఎరువుల విక్రయ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

చేర్యాల : చేర్యాల మండల రైతులు టోకెన్ల కోసం గంటల తరబడి వేచి చూశారు. ఒక బస్తా మాత్రమే ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద నిరసన చేపట్టారు.

అక్కన్నపేట : యూరియా కోసం రైతులు అక్కన్నపేటలోని ఆగ్రోస్ కేంద్రం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. యూరియా రాకపోవడంతో రైతులు వ్యవసాయ అధికారులను రైతు వేదికలో నిర్బంధించారు.

చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండలంలో ఆగ్రోస్ కేంద్రానికి యూరియా లోడ్ రాగానే రైతులు క్యూ కట్టారు. పరిమితంగా యూరియా లభించడంతో చాలా మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

బెజ్జంకి : బెజ్జంకిలో ఒక ఫర్టిలైజర్ షాపు వద్ద యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు గుమిగూడారు. పోలీసుల పహరాలో భూ విస్తీర్ణాన్ని బట్టి ఒకటి లేదా రెండు బస్తాలు పంపిణీ చేశారు.

తొగుట : తొగుట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు ఆందోళన నిర్వహించారు. తొగుట సొసైటీ కార్యాలయం వద్ద చెప్పులు, బీరు సీసాలు పెట్టి నిరసన తెలిపారు. అనంతరం ఆగ్రోస్ దుకాణం వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. తొగుట సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

హుస్నాబాద్ : హుస్నాబాద్‌లో యూరియా కోసం రైతులు రైతు మిత్ర, మన గ్రోమోర్ ఎరువుల దుకాణాల ముందు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రైతు వేదికకు తాళం వేసి ఉండటంతో వ్యవసాయ అధికారి కోసం పడిగాపులు కాశారు.

రామాయంపేట : రామాయంపేట పట్టణంలో 500 బస్తాల యూరియా లారీ రాగా, 1000 మంది రైతులు గుమిగూడారు. సిబ్బంది టోకెన్లు ఇవ్వగా, మిగతావారు నిరాశతో వెనుదిరిగారు.

నంగునూరు : నంగునూరు సహకార సంఘం వద్దకు 560 బస్తాల యూరియా వస్తుందని తెలిసి సుమారు 1200 మంది రైతులు క్యూ కట్టారు.

అయ్యో.. యూరియా

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఆగస్టు నెలకు సంబంధించి దాదాపు 20 జిల్లాల్లో యూరియా పంపిణీ పూర్తయ్యింది. అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవు. మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, భూపాలపల్లి జయశంకర్, ఖమ్మం, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, సూర్యాపేట జిల్లాలకు పూర్తి కోటా పంపిణీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, ములుగు జిల్లాల కోటా దగ్గరపడింది. ఆగస్టు నెలలో సుమారు 40 వేల టన్నుల బ్యాలెన్స్ ఉండగా ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు రావాల్సిన యూరియానే 10,466 టన్నులు ఉండడం గమనార్హం. కొన్ని జిల్లాల్లో కోటాకు మించి తరలించడం కూడా కొరతకు కారణమైనట్లుగా తెలుస్తోంది.

ప్రైవేట్ డీలర్ల విముఖత

యూరియా విక్రయించడానికి ప్రైవేట్ డీలర్లు విముఖత ప్రదర్శిస్తున్నారు. ఆగ్రోస్, సొసైటీలకు తరలిస్తున్న యూరియా రవాణా ఛార్జీలను మార్క్‌ఫెడ్ భరిస్తున్నది. దీంతో వారు రూ.266కే ఒక బస్తా యూరియా విక్రయిస్తున్నారు. అయితే ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేసే యూరియాకు రవాణా ఛార్జీలను పూర్తిగా డీలర్లే భరించాల్సి వస్తోంది. ఫలితంగా ఒక్కో బస్తాకు రూ.290దాకా ఖర్చు అవుతున్నదని, ఎమ్మార్పీకి విక్రయిస్తే ఏ లాభం ఉండదని చెబుతున్నారు. ఈ పరిస్థితిలో రూ.300కు విక్రయిస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని అంటున్నారు. వీరి రవాణా ఖర్చులను కూడా మార్క్‌ఫెడ్ భరిస్తే సగం ఈ పరిస్థితి వచ్చేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



తొగుటలో యూరియా కోసం రోడ్డుపై రైతులతో కలిసి ధర్నా చేస్తున్న సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి

నేడే డీడీఎస్‌లో ఆకుకూరల పండుగ



పొలాల్లో సహజసిద్ధంగా లభించిన ఆకుకూరలు

జహీరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పుల నేపథ్యంలో పోషకాహారం కోసం చిరుధాన్యాలు, ఆకుకూరల వైపు ప్రజలు దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో జహీరాబాద్ ప్రాంతంలో 35 ఏళ్ల క్రితం ఏర్పడిన డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఏటా డీడీఎస్ వాటి ప్రాముఖ్యతను తెలియజేసేందుకు కృషి చేస్తున్నది. అందులో భాగంగా డీడీఎస్ మహిళలు ప్రతి ఏటా ఆకుకూరల పండుగను నిర్వహిస్తూ వాటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ సారి కూడా నేడు(ఆదివారం) పండుగ నిర్వహణకు సిద్ధమైంది. ఈ పండుగను పస్తాపూర్, అల్గోల్ గ్రామాల్లో నిర్వహిస్తామని డీడీఎస్ మహిళలు పేర్కొన్నారు. తుమ్మికూర, తట్టెల్లి, అడవి మెంతం, జొన్నచెంచలి, అడవిసోయ, దొగ్గలి, ముల్లుదొగ్గలి వంటి 40 రకాల ఆకుకూరలు పొలాల్లో లభిస్తాయని డీడీఎస్ మహిళా రైతులు తెలిపారు.

దిగువ ప్రాంతాలకు వరద ముప్పు



చౌటకూర్ శివారులో కొన్యాల వంతెన వద్ద మంజీర ఉధృతి

పుల్కల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో సింగూరు ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తారు. మంజీర నదిపై ఉన్న ప్రాజెక్టులు నిండిపోవడంతో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సింగూరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 76,321 క్యూసెక్కులుగా నమోదైంది. జల విద్యుత్ ఉత్పత్తి గేటు ద్వారా 1,732 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మంజీర బ్యాక్ వాటర్‌తో పంటలు నీట మునక

సింగూరు ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తితే మంజీర రిజర్వాయర్ వద్ద 9 గేట్లు ఎత్తాల్సి ఉంటుంది. కానీ, సాంకేతిక సమస్య కారణంగా గేట్లు పైకి లేకపోవడంతో వరద నీరంతా ఆయా గ్రామాల శివారు భూములను ముంచెత్తుతున్నది. మంజీర నది తీర ప్రాంత గ్రామాలైన పోచారం, పుల్కల్, మినాపూర్, కోడూరు, ఇసోజిపేట, గొంగ్లూరు, గంగోజిపేట, చక్రియాల, శివంపేట, వెండికోలు, లింగంపల్లి, కోర్పోలు, సరాఫ్‌పల్లి, చౌటకూర్ శివారు భూముల్లో వరి, పత్తి, కంది, పెసర, మినుము, చెరుకు పంటలు నీట మునిగాయి. ప్రస్తుతం మంజీర రిజర్వాయర్ వద్ద 4,5,6,7,8,9 నంబర్ గేట్లను ఐదు మీటర్లు ఎత్తారు. దీంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

పాపన్నపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున మంజీర నది పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం ఆయన పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారి ఆలయం వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి వస్తున్న భారీ వరద కారణంగా మంజీర ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల నీరు విడుదలైనందున ఏడుపాయల వనదుర్గామాత ఆలయం, ఎల్లాపూర్ వంతెనలకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ప్రజలు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సూచనలు పాటించాలని, పశువుల కాపరులు, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్, రెవెన్యూ, పాల్గొన్నారు.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ముంపు గ్రామాల ప్రజల సేవలో..

● మెదక్ మిల్లీ అసోసియేషన్ సభ్యుల ఉదారత
● ఆహారం నుంచి ఆరోగ్యం వరకు అన్ని..
● కులమతాలకు అతీతంగా సామాజిక సేవలు

మెదక్ కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురిసిన వర్షాలకు ముంపునకు గురైన గ్రామాలను గుర్తించిన అధికారులు, ఆ గ్రామాలను ఖాళీ చేయించి మెదక్ పట్టణంలోని పలు ఫంక్షన్ హాళ్లలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెదక్ మిల్లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితులకు ఆహారం నుంచి ఆరోగ్యం వరకు అన్ని రకాల సేవలు అందిస్తూ వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకుంటున్నారు. ముంపునకు గురైన సర్దన గ్రామానికి చెందిన 1200 మంది ప్రజలను మెదక్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్, జీకేఆర్ గార్డెన్‌లకు తరలించారు. మెదక్ మిల్లీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమర్ ఖాన్, జనరల్ సెక్రటరీ డాక్టర్ సూఫీ సుజాయత్ అలీ ఆధ్వర్యంలో వీరికి ఆహారం, వైద్య సేవలు అందించారు. గాంధీనగర్, రాంనగర్ ప్రాంతాల్లోని 159 మందికి, రాయన్‌పల్లి గ్రామంలోని 130 మందికి ఆహారం, నీటిని అందించారు. రోడ్డు మార్గం లేని ధూప్‌సింగ్ తండా, ఘనపూర్, సర్దన గ్రామాలకు కాలినడకన వెళ్లి బియ్యం, నూనె, నిత్యావసర వస్తువులతో కూడిన తీకొా కిట్లను పంపిణీ చేశారు.



ఇంటింటికి వెళ్లి సరకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కులమతాలకు అతీతంగా సేవలు

డాక్టర్ సూఫీ సుజాయత్ అలీ మాట్లాడుతూ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కులమతాలకు అతీతంగా సేవలందిస్తున్నామని తెలిపారు. సేవలందించడంలో చాలా సంతోషంగా ఉందని, వర్షాలు తగ్గే వరకు అవసరమున్న గ్రామాలకు సేవలు అందిస్తామని అన్నారు. ఈ సంస్థ తరపున అనేక కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు సేవలందిస్తామని పేర్కొన్నారు. ఈ సేవలో జర్నలిస్ట్ రియాజ్, ఒమర్ ఖాన్, సయ్యద్ సాదత్ అలీ, జాకీ, జుబేర్ మెహతాబ్ మెడికల్, ఫాజిల్, అతీక్, కిజర్, అంజద్, ఇమ్రాన్, ఉమర్, అబిద్, హసద్, యూసఫ్ జర్నలిస్ట్ తదితరులు పాల్గొన్నారు.



వర్షంలో ఆహార పొట్లాలు సరఫరా చేస్తూ..

అటవీభూమి ఆక్రమణకు యత్నం

● నాలుగు వాహనాలు స్వాధీనం

శివ్వంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అటవీభూమిని ఆక్రమిస్తున్నారని అటవీశాఖ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్లు, నాలుగు డోజర్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ సెక్షన్ అధికారి శ్రీధరాచార్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని పిలుట్ల రిజర్వు ఫారెస్ట్‌లో కొందరు గుట్టు చప్పుడు కాకుండా అడవి భూమిలో చెట్లను, పొదలను తొలగించి వ్యవసాయ భూమిగా మార్చేందుకు ఎక్స్‌కవేటర్లు, డోజర్ ట్రాక్టర్లతో భూమిని చదును చేస్తున్నారు. విషయం తెలిసి అటవీశాఖ అధికారులు దాడులు చేసి రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని నర్సాపూర్ అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సిద్ధిరాంసింగ్, సెక్షన్ ఆఫీసర్లు, రాజమణి, సాయిరాం, బీట్ ఆఫీసర్ కుమార్ వెంకటేష్, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌ది మాటల ప్రభుత్వమే..

● మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

మునిపల్లి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతోనే సరి పెడుతుందని, చేతల్లో మాత్రం చూపించడం లేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. శనివారం మునిపల్లి మండలం పీఎస్ఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులే ఇప్పుడు ప్రజలకు కనబడుతున్నాయని, అప్పట్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇప్పుడు శంకుస్థాపనలు చేసి తమ ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందంటూ గొప్పలు చెప్పుకోవడం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి రెండేళ్లు కావస్తున్నా.. ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో పనులు తప్ప, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం రైతులు యూరియాతో ఇబ్బందులు పడుతున్నా.. యూరియా కొరతను తీర్చలేకపోతుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, నాయకులు శివశంకర్, చంద్రయ్య, పరుశరాం గౌడ్, భాస్కర్, రమేష్. శంకర్, విశ్వనాథం, శ్రీనివాస్, వెంకటేశం, పాండు, దత్తు, దుర్గయ్య, కుతుబోద్దీన్, మౌలానా పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విశ్వేశ్వర్‌రావు



గజ్వేల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణానికి చెందిన పాటల రచయిత, స్వరకర్త, గాయకుడు రాయారావు విశ్వేశ్వరరావు గత ఐదు సంవత్సరాలుగా స్నేహం గురించి పాటలు రాయడం, స్వరపరచడం చేస్తున్నారు అయనలోని ప్రతిభను గుర్తించి లండన్‌లోని ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించి ధ్రువీకరణ పత్రం అందించారు.

న్యూస్ బాక్స్

చట్టాలపై అవగాహన ఉండాలి : కవితాదేవి

కోహీర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ కవితాదేవి అన్నారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

రాయికోడ్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంజయ్య అన్నారు. శనివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మొక్కలను నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ సిద్దన్నపాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీనర్సింలు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సతీష్‌కులకర్ణి, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, తహసీల్దార్ పాల్గొన్నారు.

కులవివక్షను పాటించడం చట్టరీత్యా నేరం

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/తూప్రాన్/మనోహరాబాద్/వెల్దుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కులవివక్ష పాటించడం చట్టరీత్యా నేరమని, కులమతాలకతీతంగా కలిసి ఉండాలని అల్లాదుర్గం ఎస్‌ఐ శంకర్, తహసీల్దార్ మల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని బహిరన్‌దిబ్బలో పౌరహక్కుల సమావేశం నిర్వహించారు. పెద్దశంకరంపేట మండలం బద్దారంలో ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శివానందం, మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, వెల్దుర్తి మండలం శెట్టిపల్లిలో ఏఎస్‌ఐ లక్ష్మణ్, ఆర్‌ఐ నర్సింగ్‌యాదవ్ పౌరహక్కులపై అవగాహన కల్పించారు.

దైవనామ స్మరణతోనే ముక్తి

నారాయణఖేడ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దైవనామ స్మరణతోనే మానవ జన్మకు ముక్తి లభిస్తుందని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ అన్నారు. శనివారం ఆలయం ఆవరణలో శ్రావణమాస పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

పర్యావరణంపై చిత్రలేఖనం పోటీ

జిన్నారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కొడకంచిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం స్థానిక అమ్మచెరువు కట్టపై మొక్కలు నాటారు.

ముగిసిన క్రీడా పోటీలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ స్పోర్ట్స్ డే మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన హెరిటేజ్ ఆటల పోటీలు జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీంబేగ్ పర్యవేక్షణలో శనివారంతో ముగిశాయి. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధి కమిటీ కార్యవర్గం

జోగిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జోగిపేటలోని అయ్యప్ప సేవాసమితి (అయ్యప్ప ఆలయ అభివృద్ధి కమిటీ) కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా రాజశేఖర్ కులకర్ణిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పులుగు గోపాల్‌రావు, కోశాధికారిగా బంధం కిషోర్, గౌరవాధ్యక్షులుగా జహంగీర్‌రెడ్డి, రుద్రారం మాణయ్య, ఉపాధ్యక్షులుగా అల్లె శ్రీకాంత్, గాజుల నవీన్, శ్యాంప్రసాద్, చిట్టిబాబు, సార శ్రీధర్, కార్యదర్శులుగా రంగంపేట రాజు, అనంతరాజు, హెచ్.సందీప్‌గౌడ్, ఆకుల సాయి, ఎం.దత్తు ఎన్నికయ్యారు.

'కొత్తపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు వేయాలి'

పాపన్నపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మెదక్ -బొడ్మట్‌పల్లి రోడ్డుపై అనంతుని వాగు బ్రిడ్జికి ఇరుపక్కల శిథిలమైన రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆర్‌అండ్‌బీ ముఖ్య అధికారి వికాస్‌రాజ్‌కు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.

ధ్వంసమైన అప్రోచ్ రోడ్డు పరిశీలన

పాపన్నపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని కుర్తివాడ శివారు ఎంచవాగుపై ఉన్న వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో శనివారం కిసాన్ కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డితో కలిసి పంచాయతీరాజ్ ఏఈ గోపాల్ పరిశీలించారు. గ్రామానికి చెందిన వారు పంట పొలాలకు వెళ్లేందుకు ఈ వంతెనే మార్గమని, వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోవింద్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు ఆకుల శ్రీనివాస్, రమేష్‌గౌడ్, నాయకులు చంద్రశేఖర్, సంజీవరెడ్డి, రామాగౌడ్, రాజేందర్, నరేష్, జగన్‌రెడ్డి, ముశెట్టి కిష్టయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు పటిష్ఠ కార్యాచరణ

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, రోడ్ల పరిశీలన

హవేళిఘణపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పటిష్ఠ కార్యాచరణను చేపడుతోందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం మండలంలోని బూర్గుపల్లి, వాడి, కప్రాయిపల్లి, దూప్‌సింగ్‌తండాల్లో భారీ వర్షాలకు తెగిన రోడ్లు, పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 50 ఏళ్లకాలంలో ఎప్పుడూ ఇలాంటి ప్రకృతి విపత్తును చూడలేదని పెద్దలు పేర్కొన్నట్లు తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఈఈ నరసింహులు, ఆర్డీవో రమాదేవి, రైతులు ఉన్నారు.

●**టేక్మాల్:** మంజీరానది పరీవాహక ప్రాంతాలకు ఎవరూ పోవద్దని తహసీల్దార్ తులసీరాం పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దున్నూర, కోరంపల్లి, ఎల్లకుర్తి, శేరిపల్లి గ్రామాల్లో పంటలను పరిశీలించారు.

●**పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

●**పాపన్నపేట:** పాపన్నపేట మండలంలో ముంపునకు గురైన పంటలను ఆరేపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో శనివారం పరిశీలిస్తున్నట్లు ఏడీఏ విజయనిర్మల, వ్యవసాయాధికారి నాగమాధురి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

●**చిన్నశంకరంపేట:** గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చిన్నశంకరంపేట మండలంలోని 500 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

●**వట్‌పల్లి:** వట్‌పల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

●**కల్హేర్ :** మండల పరిధిలోని మాసాన్‌పల్లి, దేవునిపల్లి గ్రామాల్లో భారీ వర్షాలకు నష్టపోయిన వరి, పత్తి పంటలను మండల వ్యవసాయ అధికారి వెంకటేశం శనివారం పరిశీలించి నష్టం అంచనా వేశారు. మాసాన్‌పల్లి శివారులోని 305, 308 సర్వే నంబర్లలోని 5 ఎకరాల్లోని వరి పంటలో ఇసుక వేసింది. దేవునిపల్లి గ్రామానికి చెందిన బాల్యానాయక్‌కు చెందిన రెండు ఎకరాల్లో ఇసుక మేట వేసినట్లు గుర్తించారు. ఏఈవో సంతోషకుమారి ఉన్నారు.



హవేళిఘణపూర్ : కప్రాయిపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వరద బాధితులకు అండగా ఉంటాం

హవేళిఘణపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దూప్‌సింగ్‌తండాలో ఆమె బుధవారం పర్యటించి బాధితులను పరామర్శించి, మాట్లాడారు. తండా బ్రిడ్జి 40 శాతం పూర్తయిందని, అంతలోనే ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టరుకు ఎన్‌ఓసీ సర్టిఫికేట్ ఇవ్వనందున పనిచేయడంలేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం అందజేయాలన్నారు. అనంతరం రాజిపేట గ్రామంలో వరదలో కొట్టుకుపోయి మృతిచెందిన యాదాగౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లావణ్యరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, యామిరెడ్డి, సాయాగౌడ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి : ఎంపీ

జహీరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 4న జహీరాబాద్ పట్టణంలో వినాయక నిమజ్జనాలు చేయనున్న నేపథ్యంలో అధికారులు అవసరమగు ఏర్పాట్లు చేయాలని ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నారింజ ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు.

●**నారాయణఖేడ్:** ఖేడ్ మున్సిపాలిటీతోపాటు చుట్టు పక్క గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలను సమీపంలోని మనూరు మండలం కమలాపూర్ చెరువులో నిమజ్జనం చేస్తుంటారు. నిమజ్జనాలకు ఆటంకాలు లేకుండా చేస్తున్న ఏర్పాట్లను సబ్‌కలెక్టర్ ఉమాహారతి, మనూరు ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు, మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సురేష్‌షెట్కార్, మాజీమంత్రి డా.చంద్రశేఖర్

●**రామచంద్రాపురం టౌన్:** వినాయక విగ్రహాల నిమజ్జనం చేసే రాయసముద్రం కోనేరును కార్పొరేటర్ పుష్పానగేష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట ఉపకమిషనర్ సురేష్, విజయమోహన్, కేశవులు, మల్లికార్జున్, నగేష్, శ్రీను, భాస్కర్ ఉన్నారు.

పటాన్‌చెరులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి : ఎమ్మెల్యే

పటాన్‌చెరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పారిశ్రామికవాడలకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. వైద్యఆరోగ్య శాఖ అధికారులతో కలిసి నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. భవన నిర్మాణానికి రూ.300 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. 24 రకాల విభాగాల్లో నిత్యం అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జరుగుతున్న నిర్మాణాలు తుదిదశలో ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే వైద్యుల నియామక ప్రక్రియ ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయ్‌కుమార్, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. అలాగే పటాన్‌చెరు డివిజన్ పరిధి గౌతమ్‌నగర్‌లో రూ.కోటి అంచనాతో నిర్మించతలపెట్టిన సామూహిక భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడ అగర్వాల్ పరిశ్రమలో విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతిచెందిన బీహార్ రాష్ట్రానికి చెందిన సురేష్‌సింగ్ కుటుంబసభ్యులకు క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.60 లక్షల చెక్కును అందజేశారు.



ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న మహిపాల్‌రెడ్డి

అకలాయితండాలో అట్టహాసంగా తీజ్

నారాయణఖేడ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అకలాయితండాలో 11 రోజులుగా నిర్వహించిన తీజ్ వేడుకలు శనివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా తండాకు చెందిన అవివాహిత యువతులు మొదటిరోజున 11 రకాల విత్తనాలను ఒకే బుట్టలో వేసి ప్రతిరోజు వాటిచుట్టూ భక్తిపాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలు చేస్తూ వేడుకలు నిర్వహించారు. చివరిరోజున మొలకెత్తిన విత్తనాల బుట్టలను యువతులు తలలపై పెట్టుకొని భవానీమాత, సేవాలాల్ ఆలయాల నుంచి సమీపంలోని చెరువు వరకు ర్యాలీగా వెళ్లి నిమజ్జనంతో గంగమ్మ ఒడికి పంపారు. టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని చాప్టా.కెకు చెందిన కాంగ్రెస్ నియోజకవర్గ సామాజిక మాధ్యమ సమన్వయకర్త నందు సోదరుడు సిద్దు(26) ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం గ్రామానికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకొని శనివారం శ్రీనివాస్ గ్రామానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి, యోగ క్షేమాలను తెలుసుకున్నారు.



అకలాయితండాలో తీజ్ వేడుకలు

సజావుగా స్థానిక సంస్థ ఎన్నికలు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థ ఎన్నికల ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల వారి ఓటర్ జాబితాను అనుసరించి గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ఓటర్ జాబితాను సిద్ధం చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామపంచాయతీల్లో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే నేడు ఆదివారం వరకు అవకాశం ఉందన్నారు. సెప్టెంబరు 2న ఫొటోలతో కూడిన తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీపీవో యాదయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలి



సమీక్షా నిర్వహిస్తున్న జడ్పీసీఈవో, ఆర్డీవో

తూప్రాన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలోని గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో భారీ వర్షాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా నిర్వహించారు. రోడ్లు బాగు చేసేందుకు పంచాయతీరాజ్ ఏఈ సహాయం తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాలు కురిసినందున శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించి, రోగాలు ప్రబలకుండా చూడాలని కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు ఏర్పాటుకు మండల పరిషత్ కార్యాలయం భవనం ఖాళీచేసి ఐవోసీ భవనంలో వెళ్లేందుకు ఐవోసీ భవనంలో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

పథకాలకు ఆకర్షితులపై చేరికలు

నర్సాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై ఇతర పార్టీల కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున బీజేపీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని ఆ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లోని మల్లేశ్‌గౌడ్ స్వగృహంలో స్థానిక చైతన్యపురి కాలనీకి చెందిన పలువురు మహిళలు, యువకులు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, నాగరాజు, జిల్లా కార్యదర్శి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బిల్లు చెల్లింపునకు కలెక్టర్ హామీ

- జడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్డికి తొలగిన తాళం



మరుగుదొడ్డి తాళం తీస్తున్న అధికారులు

పుల్‌కల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్డికి మూడేళ్ల క్రితం వేసిన తాళం శనివారం తొలగించారు. 2022లో సర్పంచ్ కొల్కూరి వీరమణిమొగులయ్య ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.12 లక్షలతో యూరినర్స్, టాయిలెట్స్, మరుగుదొడ్లను నిర్మించారు. అయితే ఈ పనులు చేపట్టినందుకు కేవలం రూ.5 లక్షల బిల్లు మాత్రమే చెల్లించారు. మిగితా బిల్లు చెల్లిస్తేగాని వినియోగంలోకి తీసుకువచ్చేది లేదంటూ సర్పంచ్ వీరమణిమొగులయ్య భీష్మించారు. చేసేది లేక ఉపాధ్యాయులు మిన్నకుండిపోయారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. మరుగుదొడ్ల విషయాన్ని ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. బిల్లులు రాకపోవడంతో తాను అప్పుల పాలయ్యానంటూ సర్పంచ్ వీరమణి కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన కలెక్టర్ బిల్లు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శంకర్, పీఆర్ ఏఈఈ శశికుమార్‌లను ఆదేశించారు. దీంతో మరుదొడ్లకు మూడేళ్లుగా వేసిన తాళాన్ని తొలగించి, వినియోగంలోకి వచ్చేలా కృషిచేసిన కలెక్టర్ ప్రావీణ్యకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలావుండగా, ఎన్‌హెచ్‌ఏఐ 161 పాత రహదారిపై హైమాస్ లైట్లను ఏర్పాటు చేసేందుకు ఎంపీడీవో శంకర్, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, కారోబార్ జాఫర్ స్థలాన్ని పరిశీలించారు.

ఉద్యోగ విరమణ తప్పదు : ఎస్పీ శ్రీనివాసరావు

చిన్నశంకరంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. చిన్నశంకరంపేట పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట నర్సింహారావు ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా శనివారం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ దంపతులకు సన్మానం చేసి, వీడ్కోలు పలికారు.



హెడ్ కానిస్టేబుల్ వెంకట నర్సింహారావుకు సన్మానం చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

సేవలే గుర్తుండిపోతాయి

నిజాంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ అనేది సహజమని, వృత్తిలో చేసిన సేవలే చిరకాలంగా గుర్తుండిపోతాయని ఎంపీడీవో రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జూనియర్ అసిస్టెంట్ బాలయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలయ్య, బుజ్జమ్మ దంపతులను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏపీవో నరసింహారెడ్డి పాల్గొన్నారు.

●**వట్‌పల్లి :** మండలంలోని పోతులబోడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఈవో గోవింద్‌రెడ్డి ఉద్యోగ విరమణ శనివారం నిర్వహించారు. డీఈవో వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై సన్మానించారు.

డిజిటల్ లెర్నింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయండి

పుల్‌కల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తరగతి గదుల్లో ఉపాధ్యాయులు డిజిటల్ లర్నింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 'ఏ బుక్ ఆన్ డిజిటల్ లర్నింగ్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అంశంపై మూడురోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లర్నింగ్ విధానం అమలు కానున్నదన్నారు. జిల్లాలోని మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్ విభాగాల ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ గల 37 పాఠశాలల నుంచి దాదాపు 120 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. ఎంఈవో బాలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నోడల్ అధికారి లింబాజీ, సీఎంవో కె.వెంకటేశం, డీఆర్పీలు పాల్గొన్నారు.

ఇదేం జాబితా..!

(5వ పేజీ తరువాయి)

ఓటరు జాబితాలపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం కావడమే ఇందుకు నిదర్శనం.

వాళ్లు బతికే ఉన్నారట

నాలుగేళ్ల క్రితం చనిపోయినవారికి కూడా తాజా ఓటరు జాబితాలో ఓటు హక్కు కల్పించారంటే అతిశయోక్తి కాదు. గత జనవరి నెల నుంచే అప్‌డేట్ చేశామని పలువురు సిబ్బంది చెబుతున్నారు. ఇలాగైతే ఏడాది క్రితం చనిపోయివారి పేర్లు కూడా చాలాచోట్ల కనిపించినట్లు తెలుస్తున్నది. చనిపోయినవారి వివరాలు జాబితాలో ఉండడం చూసి ఆయా గ్రామస్థులు అధికారుల పనితీరుపై ఆశ్చర్యపోతున్నారు. వీరిని తొలగించాల్సి ఉండగా కొన్నిచోట్ల మాత్రమే సవరించారు.

చిత్రవిచిత్రంగా జాబితా

ప్రజాస్వామ్యయుతంగా, పకడ్బందీగా ఉండాల్సిన ఓటరు జాబితాలో చిత్రవిచిత్రాలు కనిపిస్తున్నాయి. భార్యభర్తల చిరునామాలను మార్చడం, ఒక ఊరి ఓటరును మరో ఊరిలో చేర్చడం, ఏళ్ల క్రితం పెళ్లయినవారికి మళ్లీ ఓటు హక్కు కల్పించడం, ఒక్కరి ఫోటో, వివరాలు పలుమార్లు కనరావడం విమర్శలకు దారితీస్తోంది. హిందీలో పేర్లు, వివరాలు ఉన్నా సరి చేయకుండా జాబితాలు ప్రదర్శించడం విడ్డూరం కలిగిస్తోంది. గతంలో ఉన్న జాబితాలోని తప్పుల సవరణ చేయాల్సిన వాళ్లు ఇంకా ఎక్కువ తప్పులు చేశారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరద తగ్గింది.. కన్నీరు మిగిలింది

(5వ పేజీ తరువాయి)

చిక్కుకుపోయింది. బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. తండాకు వెళ్లే దారిలోని బ్రిడ్జి కొట్టుకుపోయింది. తండా ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికారు. గతంలో ఎన్నడూ ఇంతటి జలప్రళయం చూడలేదని తండావాసులు పేర్కొంటున్నారు. దూప్‌సింగ్‌తండాలో ఉన్న 70 కుటుంబాలు, 400 మంది జనాభా వరద నీటితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోకి వరద నీరు వచ్చి నిత్యావసర వస్తువులు పాడైపోయాయి. తినడానికి తిండిలేక అవస్థలు పడ్డారు. పంటపొలాలు, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. నీరు తగ్గిన తర్వాత అధికారులు ప్రజలకు నిత్యావసర వస్తువులు, ట్యాంకర్ల ద్వారా నీళ్ల అందించారు. కొట్టుకుపోయిన బ్రిడ్జిపై మట్టిని పోసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ట్రాన్స్‌కో అధికారులు పునరుద్ధరించారు.

ఏడుపాయల ఆలయం ఇంకా జలదిగ్బంధంలోనే..

పాపన్నపేట మండలంలోని ఏడుపాయల ఆలయం 10 రోజులుగా మంజీరా వరదలోనే మునిగి ఉంది. సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు వదులుతుండటంతో ఏడుపాయల్లో వరద ప్రవాహం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం సుమారు 70వేల క్యూసెక్కుల నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి పరుగులు పెడుతోంది. రాజగోపురంలోనే అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్నారు. భక్తులు నది వైపు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో మంజీరా పరివాహక ప్రాంతంలోని సుమారు 3వేల ఎకరాల వరి వరదల్లో మునిగిపోయింది. వరద పూర్తిగా తగ్గిన తర్వాతే నష్టాన్ని అంచనా వేయడం సాధ్యమని అధికారులు పేర్కొన్నారు. దెబ్బతిన్న రోడ్లను అధికారులు మట్టితో పూడ్చారు. మండలంలో 32 ఇళ్లు దెబ్బతిన్నట్లు తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి.

పంటలకు నష్ట పరిహారం అందించాలి

- ఎంపీని కోరిన రైతులు

కల్హేర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గత మూడురోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్‌ను మండల పరిధిలోని మాసాన్‌పల్లి, దేవునిపల్లి, బుగ్యానాయక్, రత్నానాయక్‌తండాలకు చెందిన రైతులు వేడుకున్నారు. మండల పరిధిలోని మాసాన్‌పల్లి చౌరస్తాలో శనివారం ఎంపీని కలిసి పంటల నష్టం గురించి వివరించారు. ఎంపీ సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులతో మాట్లాడి సర్వేచేసి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. రైతులతో పాటు కాంగ్రెస్ నాయకులు గోపాల్, శంకర్, శ్రీనివాస్, పోచయ్య ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

కల్హేర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ చేయనున్న మండల పరిధిలోని బీబీపేట గ్రామానికి చెందిన పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్‌ను శాసనమండలిలోని చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎమ్మెల్సీలు విజయశాంతి, పింగిలి శ్రీపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్కా కొమురయ్య, ఏవీఎన్ రెడ్డితో కలిసి శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులుగం దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పీజీ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కల్హేర్ మండల పరిధిలోని మార్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ గుండు లక్ష్మణ్‌ను పాఠశాల సిబ్బంది, పీఆర్టీయూ మండల బాధ్యులు శనివారం సాయంత్రం సన్మానించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, పీఆర్టీయూ నాయకులు

'సెయింట్ ఆంథోనీస్'లో ఫ్రెషర్స్‌డే



ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యాసంస్థల అధినేత సాల్మాన్‌రెడ్డి, అధ్యాపకులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత ఈ.సాల్మాన్‌రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం డిగ్రీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. అలాగే డైరెక్టర్లు విజయకుమార్‌రెడ్డి, జయబాలరెడ్డి చేతులమీదుగా ఆటల పోటీల విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జవహర్, అకాడమిక్ కౌన్సిలర్ డా.కృష్ణకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నమ్మి ఓటేసినందుకు రైతులకు ఇన్ని బాధలా..?

వట్‌పల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అబద్ధపు మాటలను నమ్మి ఓటేసినందుకు రైతులకు ఇన్ని బాధలు పెట్టడం ప్రభుత్వానికి సబబు కాదని రాష్ట్ర ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మఠం బిక్షపతి అన్నారు. శనివారం వట్‌పల్లిలో మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల రైతుల బతుకులు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక బస్తా యూరియా కోసం మూడురోజుల పాటు దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.



మఠం భిక్షపతి